సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు : ఎమ్మెల్యే



ఎమ్మెల్యే వెంకటేష్‌కు సమస్యలను వివరిస్తున్న బస్తీ సంక్షేమ సంఘం నేతలు

నల్లకుంట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని అన్ని కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యల శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పేర్కొన్నారు. గురువారం డివిజన్‌లోని బతుకమ్మకుంట, రామకృష్ణహాట్స్ బస్తీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను కలిసి స్థానిక సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. బస్తీలో సీసీ కెమెరాలు, నూతన సీసీ రోడ్డును ఏర్పాటు చేయాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణహాట్స్ బస్తీ సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు డి.వెంకటయ్య, ఉపాధ్యక్షుడు జి.రాములు, వై.పర్వతాలు, సహాయ కార్యదర్శి పినాగేంద్ర, కోశాధికారి ఎస్.కాశీ, నాగరాజు, రామకృష్ణ, బాలపేరు, శివ గణేష్, రవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించండి

నల్లకుంట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని రోడ్లు, అంతర్గత రోడ్లపై విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించాలని కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి జీహెచ్‌ఎంసీ, విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. స్థానిక ప్రజల ఫిర్యాదు మేరకు గురువారం డివిజన్‌లోని డీడీ కాలనీలో ఆమె పర్యటించారు. సంబంధిత శాఖ అధికారులను పిలిపించి, చెట్ల కొమ్మలను నరికి వేయించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీకాంత్ చౌదరి, సంతోష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఘటన ఉద్యమ నేత పూనెం లింగన్నకు నివాళి



లింగన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నేతలు

నల్లకుంట, జూలై 31 (ఆంధ్రజ్యోతి): భూమి, భుక్తి, పీడీత ప్రజల విముక్తి కోసం ప్రతిఘటన పోరాటంలో పూనెం లింగన్న అమరత్వం పొందారని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యులు సాధినేని వెంకటేశ్వరరావు కొనియాడారు. గురువారం విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో ప్రతిఘటనోద్యమ నాయకుడు పూనెం లింగన్న వర్ధంతి కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా అమరుడు పూనెం లింగన్న చిత్రపటానికి సాధినేని వెంకటేశ్వరరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు అరుణ, అనురాధ, పీడీఎస్‌యూ నాయకులు పి.నాగరాజు, వి.మహేష్, ఎం.నవీన్, కె.శ్రీనివాస్, గౌతమ్, ఆసిఫ్, శ్యామ్, యశ్వంత్, పీవోడబ్ల్యూ నాయకులు భారతి, మల్లిక్, రహీం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం



ముషీరాబాద్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్, జీహెచ్‌ఎంసీ డీఎంసీ రామానుజుల రెడ్డి, ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణ

ముషీరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే ప్రతిఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటారని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్‌లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మలేరియా నిర్మూలనకు నిర్వహించిన ర్యాలీలో జీహెచ్‌ఎంసీ సర్కిల్-15 డీఎంసీ రామానుజుల రెడ్డి, ఏఎంవోహెచ్ డాక్టర్ ప్రవీణలతో కలిసి కార్పొరేటర్ సుప్రియా నవీన్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా దోమలు వృద్ధి చెందకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తూ డివిజన్‌లోని కళాధర్‌నగర్, గంగపుత్రకాలనీ, బాపూజీనగర్‌లో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, పార్టీ నాయకులు మెట్టు వాసు, వెంకటేష్, బాలు, ప్రసాద్‌గుప్తా, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

అర్చక, ఉద్యోగుల మలిదశ సాధన సమితి సంఘం ఎన్నిక

ముషీరాబాద్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ అర్చక, ఉద్యోగుల మలిదశ గ్రాంట్- ఇన్-ఎయిడ్ సాధన సమితి నూతన సంఘాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం భోలక్‌పూర్‌లోని భవాని శంకర దేవాలయ ప్రాంగణంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అర్చక, ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. అర్చక సంఘం అధ్యక్షుడిగా సంగవరపు ప్రసాద్ శర్మ, ఉపాధ్యక్షుడిగా మాడభూషిణి నాగరాజు, ప్రధాన కార్యదర్శి నెమలికొండ జయవర్ధన చార్యశర్మ, కార్యదర్శి అన్నెపర్తి శివప్రదీప్ శర్మను ఎన్నుకున్నారు. అలాగే ఉద్యోగ సంఘం నూతన అధ్యక్షుడిగా దురిశెట్టి విద్యాసాగర్, ఉపాధ్యక్షులుగా ఆసోరి మరికంటి ముకుందు, పెనుమాక గోపి, ప్రధాన కార్యదర్శులుగా పొన్నగంటి వెంకన్న, గోర్లపల్లి గణేష్, కార్యదర్శులుగా నాగార్జున, ఉద్యమకారి విశాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, అర్చకులు నూతన సంఘానికి ఎన్నికైన వారిని ఘనంగా సన్మానించారు.

నాటకరంగ విద్యార్థులకు రోల్‌మోడల్ ప్రదీప్‌కుమార్



నాటకంలోని నటీనటులతో ప్రొ.పురుషోత్తమ్, ప్రొ.ప్రదీప్‌కుమార్

చిక్కడపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): చారిత్రక నాటకాల ప్రదర్శనలు నిర్వహిస్తూ నటించడంతోపాటు దర్శకత్వం బాధ్యతలు చేపట్టి విజయవంతంగా కొనసాగిస్తున్న ప్రొ.ప్రదీప్‌కుమార్ నాటకరంగ విద్యార్థులకు రోల్‌మోడల్‌గా ఉన్నారని రాష్ట్ర ఉన్నతవిద్యామండలి వైస్‌చైర్మన్ ప్రొ.ఇటిక్యాల పురుషోత్తం అన్నారు. తులసిభవన్ భక్తి సాహిత్య సాంస్కృతిక పరిశోధన కేంద్రం వారు ఉస్మానియా విశ్వవిద్యాలయం, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వారి సౌజన్యంతో గురువారం త్యాగరాయగానసభలో ప్రేమ్‌చంద్, తులసిదాసు జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రొ.ఇటిక్యాల పురుషోత్తమ్ మాట్లాడుతూ తులసి భవన్ డైరెక్టర్ ఆచార్య ప్రదీప్‌కుమార్ చారిత్రక నాటకాల దర్శకత్వ ప్రతిభను అభినందించారు. ప్రొ.సుభద్ర, ప్రొ. రేఖారాణి, ప్రొ.రాములు, డా.ప్రేమలత, డా.సుమన్‌లత, ప్రొ.రహీమ్‌పరాన్, దినేష్‌సింగ్, డా.హెచ్ కె వందన, డా.పి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

రైలులో గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

బర్కత్‌పుర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గుట్టుచప్పుడు కాకుండా రైలులో మహారాష్ట్ర నుంచి నగరానికి గంజాయిని తరలిస్తున్న వ్యక్తిని కాచిగూడ పోలీసులు పట్టుకున్నారు. అతడి నుంచి 3.10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాచిగూడ సీఎస్ అడ్మిన్ ఎస్ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లేపల్లిలోని అఫ్జల్‌సాగర్ మంగార్ బస్తీకి చెందిన బాబురావు కుమారుడు అమాన్ వృత్తి రీత్యా ఆటోడ్రైవర్. ఆయన అక్రమ మార్గంలో డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో వివిధ ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకొచ్చి పొట్లాలు కట్టి గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తుంటాడు. ఈ క్రమంలో గురువారం మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి రైలులో గంజాయి తీసుకొచ్చాడు. కాచిగూడ రైల్వేస్టేషన్‌లో రైలు దిగిన ప్రధాన గేటుకు సమీపంలో ఆటోస్టాండ్ వైపునకు వెళ్తుండగా.. అనుమానించిన పోలీసులు అతడిని పట్టుకుని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన వెంట ఉన్న బ్యాగులో 3.10 కిలోల గంజాయి దొరికింది. గంజాయిని స్వాధీనం చేసుకుని, అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు



గోల్కొండ చౌరస్తాలో గుంతలుపడ్డ రోడ్డు



గోల్కొండ సిగరేట్ ఫ్యాక్టరీ నుంచి గుంతలమయమైన రోడ్డు



రిసాల చౌరస్తాలో గుంతల రోడ్డు

కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల వల్ల ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు గుంతలమయంగా మారాయి. దీంతో ఆయా ప్రాంతాలలో రాకపోకలు సాగించే వాహనదారులు, పాదచారులు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. సర్కిల్ పరిధిలోని రాంనగర్, అడిక్‌మెట్, ముషీరాబాద్, భోలక్‌పూర్, గాంధీనగర్, కవాడిగూడ డివిజన్లలోని కాలనీలు, బస్తీలలోని రోడ్లన్నీ అరఫీటు లోతు గుంతలమయంగా మారాయి. ఈ రోడ్లపై వాహనదారులు గుంతల్లో అదుపుతప్పి కిందపడి గాయాలకు గురవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు కిందపడిపోతున్నారు. దెబ్బతిన్న రోడ్లకు వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్లు గుంతలమయమైన రోడ్లపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని కోరుతున్నారు.

- రాంనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి)

ప్రజలు, వాహనదారులకు ఇబ్బందులు



ముషీరాబాద్ నియోజకవర్గంలో వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్ల వల్ల ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మెయిన్ రోడ్లు, బస్తీలు, కాలనీల్లో గుంతలమయమైన రోడ్ల వల్ల రాకపోకలకు మహిళలు, చిన్నారులు, వృద్ధులు ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్నిచోట్ల వీధిదీపాలు వెలగకపోవడంతో గుంతలలో పడి ప్రమాదాలకు గురవుతున్నారు. వెంటనే జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్లకు మరమ్మతులు చేయాలి.

- పాశం సాయికృష్ణయాదవ్, బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు

మరమ్మతులు చేస్తాం



ముషీరాబాద్ సర్కిల్ పరిధిలో వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతు పనులు చేపడతాం. ఇప్పటికే కొన్ని ప్రాంతాలలో గుంతలను పూడ్చాం. అన్ని ప్రాంతాల్లో గుంతలమయమైన రోడ్లకు మరమ్మతులు చేపట్టేందుకు ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించాం. అన్ని కాలనీలు, బస్తీలు, మెయిన్ రోడ్లలో పర్యటించి పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

- ముషీరాబాద్ సర్కిల్ డీఎంసీ రామానుజులరెడ్డి



గుంతలమయమైన రాంనగర్ మెయిన్ రోడ్డు నుంచి ఎస్ఆర్‌టీ కాలనీకి వెళ్లే దారి



రాంనగర్ కూరగాయల మార్కెట్ చౌరస్తాలో గుంతలమయమైన రోడ్డు



బాగ్‌లింగంపల్లి నుంచి శ్రీరామ్‌నగర్‌కు వెళ్లే రోడ్డు

దేవాలయాల సమగ్రాభివృద్ధికి కృషి

మాజీ ఎంపీ అంజనకుమార్ యాదవ్



ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులకు నియామక పత్రాలు అందజేస్తున్న మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, దేవాదాయశాఖ అధికారులు

కవాడిగూడ, జూలై 31 (ఆంధ్రజ్యోతి): దేవాలయాల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషిచేస్తుందని, ఆలయాన్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేసి, భక్తులకు సౌకర్యాలు కల్పిస్తుందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్ యాదవ్ అన్నారు. గురువారం దోమలగూడ హనుమాన్ దేవాలయ నూతన కమిటీ చైర్మన్‌గా కేఆర్‌కే ప్రసాద్, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులుగా ఆర్.రాము, వై.కృష్ణ, జె.పరమేశ్వర్, ఆర్.వెంకట్‌రెడ్డి, సలంద్రిశివకుమార్‌యాదవ్, కె.మంజులరాణి, జె.మహేందర్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఆలయ ఈవో దేవనాథం సమక్షంలో మాజీ ఎంపీ అంజన్‌కుమార్‌యాదవ్ వారితో ప్రమాణం చేయించారు. అనంతరం వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ ఏ అండ్ బీ బ్లాక్ అధ్యక్షులు వీడీ.కృష్ణ, అంజియాదవ్, వివిధ డివిజన్ల అధ్యక్షులు పోతరాజు భాస్కర్, అభిషేక్ కెనడి, పెండం శ్రీనివాస్‌యాదవ్, తిరుమల్‌రావు, చైర్మన్లు మారి శెట్టినర్సింగ్‌రావు, జానకి సుధాకర్, మేడి సురేష్, మాజీ కార్పొరేటర్ ఆర్.కల్పనాయాదవ్, ఎన్.అంజిరెడ్డి, జిఎన్‌కేశవ్, డి.వెంకటేష్, జయేందర్‌బాబు, యాదగిరిగౌడ్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతన పాలకమండలి సభ్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

బీజేపీ ఓబీసీ మోర్చా మహాధర్నా రేపు



మాట్లాడుతున్న బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు వినోద్ యాదవ్

బర్కత్‌పుర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయడంలో పూర్తిగా వైఫల్యం చెందిందని బీజేపీ ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సి.వినోద్ యాదవ్ ఆరోపించారు. గురువారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఆగస్టు 2వ తేదీన ఉదయం 10గంటలకు ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ధర్నాకు బీసీ ఉద్యోగ సంఘాలు, విద్యార్థి యువజన సంఘాలు భారీ సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఓబీసీ నేతలు పాల్గొన్నారు.

వర్షాకాల ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్



కాచిగూడలో మురికి చెత్తను తొలగించే కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ ఉమాదేవి, డీఎంసీ మారుతీదివాకర్

బర్కత్‌పుర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ డివిజన్‌లో ప్రత్యేక వర్షాకాల పారిశుధ్య డ్రైవ్‌ను గురువారం నిర్వహించారు. చెప్పలబజార్ ఎస్‌సీఎస్ హాస్పిటల్ చౌరస్తాలో మురికి చెత్తను తొలగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, అంబర్‌పేట సర్కిల్-16 డీఎంసీ మారుతీ దివాకర్ మాట్లాడుతూ... మాన్‌సూన్ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్‌ను చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ తిరుపతి, వెంకటయ్య, రజిత, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్ యాదవ్, నాయకులు సుభాష్ పటేల్, క్షీరసాగర్, భీమ్‌రాజ్, వాసు, బాలప్రసాద్, రవియాదవ్, ఆర్.సంతోష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మహేష్‌కుమార్‌గౌడ్‌కు డివిజన్, బ్లాక్ అధ్యక్షుల జాబితాను జగ్గారెడ్డితో కలిసి అందజేస్తున్న పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాద్

డివిజన్, బ్లాక్ అధ్యక్షుల జాబితా అందజేత

రాంనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లా పరిధిలోని చార్మినార్, బహదూర్‌పుర, యాకత్‌పుర, చాంద్రాయణగుట్ట, మలక్‌పేట నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ డివిజన్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుల జాబితాను హైదరాబాద్ జిల్లా పరిశీలకులు, సేవాదళ్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు పొన్నాడ సుబ్రహ్మణ్యం ప్రసాద్ గురువారం ఉమ్మడి హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి జగ్గారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, మంత్రి పొన్నం ప్రభాకర్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో పార్టీ అధిష్ఠానం నూతన డివిజన్, బ్లాక్ అధ్యక్షులను నియమించనున్నదన్నారు.

ప్రధాన రోడ్లలో రబ్బర్ స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు కృషి



స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోపాల్

రాంనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గంలోని ప్రధాన రహదారులతోపాటు కాలనీలు, బస్తీలలో ప్రమాదాలు జరగకుండా ప్రధానరోడ్లలో రబ్బర్ స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ పేర్కొన్నారు. గురువారం అడిక్‌మెట్ డివిజన్‌లోని మసీదు వీధి, అచ్యుతరెడ్డి మార్గ్, విద్యానగర్‌లో స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. విద్యానగర్‌లో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వల్ల ప్రమాదాలు తగ్గుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ అడిక్‌మెట్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కె.సురేందర్, నాయకులు రవియాదవ్, కె.అనురాధ, ముచ్చకూర్తి ప్రభాకర్, శంకర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

42 శాతం రిజర్వేషన్లను బీసీలకే అమలు చేయాలి: రాజేందర్ పటేల్‌గౌడ్

బర్కత్‌పుర, జూలై 31 (ఆంధ్రజ్యోతి): విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లను పూర్తి స్థాయిలో బీసీలకే కేటాయించాలని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. ముస్లింలకు 10శాతం రిజర్వేషన్‌లను అమలుచేయమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గురువారం కాచిగూడ మోతీ మార్కెట్‌లోని మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీలకు కేటాయించిన 42శాతం రిజర్వేషన్లలో 10శాతం ముస్లింలు ఉన్నారన్న సాకుతో మోదీ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టకుండా నిర్లక్ష్యం చేసే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఈ రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో మహాసభ నేతలు భూషణ్‌భాస్కర్, పి.కృష్ణ, ముత్యాలరావు, డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, సత్యపాల్‌సింగ్, ప్రదీప్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జనహిత పాదయాత్రకు మద్దతు ఇవ్వాలి: వీహెచ్



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు మద్దతు తెలుపుతున్న మాజీ ఎంపీ వి.హనుమంతరావు, శంభుల శ్రీకాంత్‌గౌడ్ తదితరులు

రాంనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలు తెలుసుకుని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేపట్టిన జనహిత పాదయాత్రలో ప్రజలందరూ పాల్గొని మద్దతు ఇవ్వాలని మాజీ ఎంపీ వి.హనుమంతరావు కోరారు. గురువారం పాదయాత్ర చేపట్టిన మహేష్‌కుమార్‌గౌడ్‌ను అంబర్‌పేట నియోజకవర్గం నాయకులతో వీహెచ్ కలిసి సన్మానించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ఈ పాదయాత్ర ద్వారా ప్రజలకు వివరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, ఉపాధ్యక్షుడు అఫ్సర్ యూసఫ్, అంబర్‌పేట నియోజకవర్గం మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఫరీద్ అహ్మద్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం అభివృద్ధికి కృషి చేయాలి



సమావేశంలో పాల్గొన్న రవీందర్‌గౌడ్, గిరిధర్‌గౌడ్, కృష్ణగౌడ్ తదితరులు

రాంనగర్, జూలై 31 (ఆంధ్రజ్యోతి): గౌడ సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంబర్‌పేట గౌడ సంఘం చైర్మన్ బత్తిని రవీందర్‌గౌడ్, అధ్యక్షుడు పంజాల గిరిధర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ పేర్కొన్నారు. గురువారం అంబర్‌పేట గౌడ సంఘం నూతన కమిటీ సభ్యులు తమ బాధ్యతలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు నదిపల్లి శ్రీహరిగౌడ్, బింది మల్లికార్జున్‌గౌడ్, మలక్‌పేట సతీష్ ఆనంద్‌గౌడ్, రుద్రగోని శ్రీధర్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులు పంజాల మహేష్‌గౌడ్, పంజాల వెంకటేష్‌గౌడ్, కార్యనిర్వహణ కార్యదర్శులు రంగ ప్రదీప్‌గౌడ్, మారేడ్‌పల్లి రోహిత్ రాజుగౌడ్, కోశాధికారి చెరుకు రమణగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

చిక్కడపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ, ఉపాధి పథకాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకుని వృద్ధిలోకి రావాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని వై.జంక్షన్ ధరణి టెంట్‌హౌస్ వద్ద గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రయివేట్ రంగంలో ఉపాధి అవకాశాలు చాలా ఉన్నాయని, కేంద్రం అందించే రుణపథకాలకు దరఖాస్తు చేసుకుని లబ్ధిపొందాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్‌పార్లమెంటు జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, సీనియర్ నేతలు రత్నసాయిచంద్, శ్రీకాంత్, ఉమేష్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనం కోసం కమిషనరేట్ ఎదుట ధర్నా



ధర్నాలో పాల్గొన్న కార్మికులు

చిక్కడపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని తెలంగాణ ట్రేడ్‌యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎల్.పద్మ డిమాండ్ చేశారు. టీయూసీఐ హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని కార్మిక కమిషనరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరించి వేస్తున్నాయని ఆరోపించారు. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని, కనీసవేతనం రూ.26 వేలు ఇవ్వాలని, కనీసపెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, ఇతర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. అనంతరం అడిషనల్ కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రం సమర్పించారు.

పిల్లలకు టీకా బూస్టర్‌షాట్లు అందించాలి

చిక్కడపల్లి, జూలై 31 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు వెళ్లే వయస్సు వచ్చేసరికి పిల్లల్లో రోగనిరోధకశక్తిని కాపాడ్డానికి బూస్టర్ టీకా షాట్లు అందించడం అత్యంత కీలకమని కిమ్స్ చీఫ్ నియోనాటాలజిస్ట్, క్లినికల్ డైరెక్టర్ డా.బాబు ఎస్.మదార్కర్ అన్నారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 4 నుంచి 6 సంవత్సరాల వయస్సు అనేది పిల్లలకు టీకాల నుంచి రక్షణ తగ్గడం ప్రారంభించే వయస్సు అని శాస్త్రీయంగా గుర్తించబడిందన్నారు.